తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

శుక్రవారం

25 సెప్టెంబర్ 2026




## మిల్లర్లకు డెడ్‌లైన్..ఆస్తుల జప్తు హెచ్చరిక

- **అక్టోబర్ 31లోగా రూ.412 కోట్ల బకాయిలు చెల్లించాలి**



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** రబీ కేఎంఎస్ 2022-23 సీజన్‌కు సంబంధించి వేలం ద్వారా కేటాయించిన వరి బకాయిలను, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గుర్తించిన డిఫాల్ట్ పరిమాణాలకు సంబంధించిన బకాయిలను నిర్ణీత గడువులోగా పూర్తిగా చెల్లించాలని అధికారులు రైస్ మిల్లర్లను ఆదేశించారు. ఈ మేరకు ఈటీఎఫ్ ఎస్పీ కె. రామ్‌కుమార్, డీఎస్పీ వెంకటేష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి.వినోద్, జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లా మేనేజర్, సంబంధిత డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమావేశంలో రబీ కేఎంఎస్ 2022-23 సీజన్‌కు సంబంధించి వేలం ద్వారా కేటాయించిన వరికి మొత్తం రూ.474 కోట్ల బకాయిలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు రూ.62.50 కోట్లు మాత్రమే వసూలయ్యాయని, ఇంకా రూ.412 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు జీఓ నంబర్ 07, 09 ప్రకారం గుర్తించిన డిఫాల్ట్ పరిమాణాలకు సంబంధించిన బకాయిలను కూడా మిల్లర్లు తప్పనిసరిగా చెల్లించాలని స్పష్టం చేశారు.

**ఆస్తులపై చర్యలు తప్పవు...**

సంబంధిత మిల్లర్లు తమ మొత్తం బకాయిలను 2026 అక్టోబర్ 31లోగా పూర్తిగా చెల్లించాలని అధికారులు డెడ్‌లైన్ విధించారు. గడువులోగా చెల్లింపులు చేయని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు ప్రారంభిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ బకాయిల వసూలులో భాగంగా నిబంధనల ప్రకారం డిఫాల్టర్ల ఆస్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే ఆస్తులను వేలం వేసి బకాయిలను రికవరీ చేస్తామని స్పష్టం చేశారు. బకాయిలు పూర్తిగా చెల్లించిన అనంతరం మాత్రమే డిఫాల్ట్ మిల్లర్ల నుంచి వచ్చే అభ్యర్థనలు, విన్నపాలను కమిషనర్ సివిల్ సప్లయిస్ ద్వారా పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. అందువల్ల మిల్లర్లు గడువులోగా బకాయిలు చెల్లించి తదుపరి రికవరీ చర్యలకు తావు లేకుండా చూడాలని సూచించారు.

## వినాయక నిమజ్జనాలకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

- **జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్**



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** జిల్లా వ్యాప్తంగా వినాయక శోభా యాత్రలు, నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. జోగిపేట పట్టణంలోని జోగిపేట-ఆందోల్ చెరువును గురువారం సందర్శించిన ఎస్పీ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.

నిమజ్జన ప్రాంతాల్లో బారికేడింగ్, తగినంత వెలుతురు, క్రేన్‌లు, గజ ఈతగాళ్లను ముందుగానే అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. శోభాయాత్ర మార్గాల్లో రహదారుల పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్య ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్పీ వెంట జోగిపేట సీఐ అనిల్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ కిష్టారెడ్డి, కమిషనర్ తిరుపతి, విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్, ఎంఆర్‌ఓ మధుసాగర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- **పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో సేవలపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా సమీక్ష**



మిగతా 5లో..

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** జిల్లాలోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల వైద్యాధికారులు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

మందుల లభ్యత, సిబ్బంది నిర్వహణ, MLHP\T నర్సింగ్ సిబ్బంది విధుల కేటాయింపు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది నియామకాలను కలెక్టర్ సమీక్షించారు. అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. మందుల కొరత లేకుండా ముందుగానే ఇండెంట్లు సమర్పించాలని, ప్రతి నెల 15, 30 తేదీల్లో మందుల ఇండెంట్, సరఫరా, పెండింగ్ వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

## సెరికల్చర్ వైపు రైతులు మళ్లాలి

- **ప్రత్యామ్నాయ పంటలతో వాతావరణ ప్రతికూల పరిస్థితులను అధిగమించాలి: కలెక్టర్ ప్రియాంక**



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** వరి సాగుకు ప్రత్యామ్నాయంగా రైతులు సెరికల్చర్ (పట్టుపురుగుల పెంపకం) వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. గురువారం గుండుమల్ మండల కేంద్రంలోని రైతువేదికలో పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో మల్బరీ సాగు ప్రోత్సాహకాలు, పట్టు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, వర్షాభావం, నీటి లభ్యత వంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు.

కొడంగల్, కోస్గి, గుండుమల్ ప్రాంతాల్లో గతంలో పెద్దఎత్తున మల్బరీ సాగు, సెరికల్చర్ కార్యకలాపాలు జరిగి రైతులు మంచి ఫలితాలు సాధించారని తెలిపారు. అనుకూల వాతావరణం, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో మల్బరీ తోటలను తిరిగి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మిగతా 5లో..

## మాచిరెడ్డిపల్లి రోడ్డుపై డేంజర్ జర్నీ!

- **అదుపు తప్పితే అంతే.. మాచిరెడ్డిపల్లి రోడ్డు!**
- **శిథిలమైన కల్వర్టు.. కూలుతున్న రహదారి అంచులు**
- **చిన్న నిర్లక్ష్యం.. పెద్ద ప్రమాదానికి దారితీసే పరిస్థితి**
- **రాత్రివేళల్లో మరింత డేంజర్.. హెచ్చరిక బోర్డులు కరువు**
- **కొమ్మలు, రాళ్లతోనే ప్రమాద నివారణ చర్యలా?**
- **అధికారులు స్పందించేది ప్రమాదం జరిగిన తర్వాతేనా?**

**కోహీర్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం నుంచి మాచిరెడ్డిపల్లికి వెళ్లే రహదారి రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. రహదారి పక్కన ఉన్న కల్వర్టు పలుచోట్ల దెబ్బతిని శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. రహదారి పరిస్థితి చూస్తే "అదుపు తప్పితే అంతే.." అన్నట్టుగా మారిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కల్వర్టుపై గుంతలు.. అంచుల్లో కూల్చివేత**

కల్వర్టు పైభాగంలోని సిమెంట్ పలకలు, రాళ్లు దెబ్బతినడంతో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. మరోవైపు రహదారి అంచులు కూడా క్రమంగా కూలిపోతున్నాయి. వాహనం కొద్దిగా అంచు వైపు వెళ్లినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు ఈ మార్గం గండంగా మారిందని అంటున్నారు.

**వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణం**

ఇటీవల కురుస్తున్న వర్షాలతో సమస్య మరింత తీవ్రమవుతోంది. కల్వర్టు కింద నుంచి నీరు ప్రవహించే సమయంలో మట్టి కొట్టుకుపోవడంతో రహదారి అంచులు బలహీనపడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షం తర్వాత గుంతల్లో నీరు నిలవడంతో వాటి లోతు కూడా సరిగా కనిపించక వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**రాత్రివేళల్లో 'డేంజర్ జోన్'**

పగటిపూట పరిస్థితిని గమనిస్తూ వాహనదారులు జాగ్రత్తగా వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ రాత్రివేళల్లో ప్రమాదం మరింత పెరుగుతోంది. ప్రమాదకర ప్రాంతంలో స్పష్టమైన హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు లేకపోవడంతో కొత్తగా ఈ మార్గంలో వెళ్లేవారికి ప్రమాద ప్రాంతం గుర్తించడం కష్టంగా మారుతోంది. దీంతో చిన్నపాటి పొరపాటు కూడా పెద్ద ప్రమాదానికి కారణమయ్యే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

**కొమ్మలు.. రాళ్లే హెచ్చరిక బోర్డులా?**

కల్వర్టు వద్ద ప్రమాదాన్ని గుర్తించేందుకు కొమ్మలు, రాళ్లు ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులను అప్రమత్తం చేస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇవి తాత్కాలిక చర్యలేనని స్థానికులు చెబుతున్నారు. ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉండే రహదారిపై శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.



**ప్రమాదం జరిగే వరకు ఎదురుచూపులా?**

స్థానికులు పలుమార్లు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కనిపించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు పరిస్థితి మరింత దిగజారేలోపు అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత హడావుడిగా మరమ్మతులు చేపట్టడం కంటే.. ముందుగానే చర్యలు తీసుకుంటేనే ప్రజల ప్రాణాలకు రక్షణ ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

**రహదారి అంచులకు రక్షణ కల్పించాలి...**

కల్వర్టు దెబ్బతిన్న భాగాలను పూర్తిగా తొలగించి నాణ్యమైన నిర్మాణంతో పునర్నిర్మించాలని, ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రహదారి అంచులను పటిష్టం చేయడంతో పాటు వర్షపు నీరు సక్రమంగా వెళ్లేలా తగిన డ్రైనేజీ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.



**తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి...**

శాశ్వత మరమ్మతులు పూర్తయ్యే వరకు కనీసం ప్రమాద ప్రాంతానికి ఇరువైపులా స్పష్టమైన హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. రాత్రివేళల్లో ప్రమాద ప్రాంతం స్పష్టంగా కనిపించేలా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఇకనైనా అధికారుల చూపు పడేనా?**

మాచిరెడ్డిపల్లి రహదారిపై నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో కల్వర్టు సమస్యను చిన్నదిగా చూడకుండా అధికారులు అత్యవసరంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని స్థానికులు కోరుతున్నారు. "ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు.. ప్రమాదం జరగకుండా ముందే చర్యలు తీసుకోవాలి" అని వారు స్పష్టం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కల్వర్టు, రహదారి మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు

- ఎస్సీ, ఎస్టీల కేసుల పరిష్కారంపై కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక దృష్టి సాధించాలి
- ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు వారి సంక్షేమం కోసం ఖర్చు చేయాలి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య







**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, రోస్టర్ పాయింట్ల అమలు, ఖాళీల భర్తీ, ఉప ప్రణాళిక నిధులు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై శాఖల వారీగా సమీక్షించారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తు, విచారణలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, బాధితులకు పరిహారం త్వరగా అందేలా అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కేసుల పరిష్కారంపై కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం మాత్రమే వినియోగించాలని, ఇతర అవసరాలకు మళ్లించరాదని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం సహించేది లేదన్నారు. ఔట్‌సోర్సింగ్ సంస్థల్లో నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం కల్పించాలని సూచించారు.

కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ అసైన్డ్ భూములు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జనవరి నుంచి ఆగస్టు 31 వరకు జిల్లాలో 109 మంది అట్రాసిటీ బాధితులకు రూ.1.70 కోట్ల పరిహారం అందించామని, మరో 119 పెండింగ్ కేసులకు రూ.1.82 కోట్ల పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు.

ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత సమయంలో చార్జిషీట్లు దాఖలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం కమిషన్ చైర్మన్ ఎస్సీ, ఎస్టీల నుంచి వినతులు స్వీకరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, కమిషన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గిరిజన గురుకులంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 24(జనంసాక్షి):** నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులో గల తెలంగాణ గిరిజన గురుకుల కళాశాల నారాయణఖేడ్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కొరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. యం పి సి గ్రూప్ లో 22, బై పి సి గ్రూప్‌లో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ అవకాశం ఎస్టీ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందన్నారు ఆసక్తి గల విద్యార్థులు ఫోన్ నెంబర్ 8333935393, 9948787987 లకు సంప్రదించాలని ఆయన కోరారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల పరిధిలోని పలుగడ్డ గ్రామంలో గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన లోకుల సాయిరాం (30) అనే రైతు భూమి గత కొంతకాలంగా వివాదంలో ఉంది. వివాదం పరిష్కారానికి, బ్యాంకులో రుణం తీసుకున్నాడు. అయితే సదరు భూమి వివాదం పరిష్కారం కాలేకపోవడం మరోవైపు తీసుకున్న రుణానికి వడ్డీ భారం ఎక్కువై అప్పు తీరకపోవడంతో తీవ్రమనస్థాపానికి గురయ్యాడు. దీంతో బుధవారం ఉదయం పొలానికి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన సాయిరాం, అదే రోజు సాయంత్రం నరసింహస్వామి గుండు సమీపంలో చెట్టుకు ప్లాస్టిక్ తాడుతో ఉరివేసుకున్న స్థితిలో మృతిచెంది కనిపించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వృద్ధుడి కాళ్లపై నుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు



**జోగిపేట, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం ప్రమాదం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన కొనింటి మొగులయ్య బస్సు కోసం వేచి ఉండగా మెదక్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు ఆయన కాళ్లపై నుంచి వెళ్లింది.


ఈ ఘటనలో మొగులయ్యకు రెండు కాళ్లు విరిగిపోయాయి. వెంటనే స్థానికులు, ప్రయాణికులు ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ, బస్సుల రాకపోకల సమయంలో అప్రమత్తత అవసరమని స్థానికులు పేర్కొన్నారు.

## ధ్యానంతోనే నిజమైన మనశ్శాంతి




**శివ్వంపేట, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** ధ్యానం ద్వారా మానవాళికి నిజమైన ప్రశాంతత, మనశ్శాంతి లభిస్తుందని ధ్యాన మందిర నిర్వాహకులు గణేష్ తెలిపారు. పెద్దగొట్టిముక్ల శివారులోని ఉమా సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన పత్రీజీ శ్రీచక్ర పిరమిడ్ ధ్యాన మందిరం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. దాతల సహకారంతో రాష్ట్రంలోనే అతిపెద్ద ధ్యాన మందిరాన్ని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మజ్ఞానంపై శ్రీనివాస్, గణేష్ ప్రసంగించారు. అనంతరం సంగీత ధ్యానం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమన్వయ కర్త నర్సింగరావు, గురుస్వామి మురళి మనోహర్‌రెడ్డి, జంట నగరాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## బంగారు నగల కోసం వృద్ధురాలి హత్య



**పుల్కల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేటలో ఒంటరిగా నివసిస్తున్న కొత్తగాడి పోచమ్మ (70)ను గుర్తుతెలియని వ్యక్తులు గొంతు నులిమి హత్య చేసి, సుమారు మూడు తులాల బంగారు నగలు అపహరించారు. బుధవారం రాత్రి భోజనం అనంతరం నిద్రించిన పోచమ్మను అర్ధరాత్రి దుండగులు హతమార్చినట్లు పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం బంధువు సంగయ్య గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ విశ్వజన్, సీఐలు అనిల్‌కుమార్, ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఆధారాలు సేకరించాయి. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేనల్లుడు మొగులయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జక్లేర్ పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఎక్స్‌పర్ట్ టాక్

- విద్యార్థులకు భూ భౌతిక శాస్త్రంపై అవగాహన కల్పించిన ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్తలు
- లక్ష్యాలను నిర్దేశించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని పిలుపు





**మక్తల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** మండల పరిధిలోని జక్లేర్ పీఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఎక్స్‌పర్ట్ టాక్ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక సీఎస్ఐఆర్ – ఎన్జీఆర్ఐ సంస్థకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు డాక్టర్ డి. శ్రీనివాస శర్మ, డాక్టర్ ఎ. వాసంతి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులకు భూమికి సంబంధించిన పలు ఆసక్తికరమైన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు భూ భౌతిక శాస్త్రం ప్రాముఖ్యతను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో తెలియజేశారు. భూమి అంతర్భాగ నిర్మాణం, భూగర్భంలో లభించే బంగారం, రాగి (కాపర్) తదితర ఖనిజాలు, మరియు వివిధ మూలకాల ఉనికి గురించి విశదీకరించారు. అంతేకాకుండా, భూమి ఉపరితలంపై పర్వతాలు, గుట్టలు, కొండలు ఏ విధంగా ఏర్పడతాయి? వాటి వల్ల మనకు కలిగే ప్రయోజనాలు ఏమిటి? అనే విషయాలపై సమగ్ర సమాచారాన్ని అందించారు. విద్యార్థులు చిన్న వయసు నుంచే ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. చంద్రకళ, ఉపాధ్యాయ బృందం, పాఠశాల చైర్మన్, గ్రామ పెద్దలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్టూడెంట్ హెల్త్ ప్రొఫైల్ స్క్రీనింగ్



**మల్దకల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** కలెక్టర్ ఆదేశాల, డీఎంహెచ్వో ఆదేశాల మేరకు ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని అమరవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఆరవ తరగతి నుండి స్టూడెంట్ హెల్త్ ప్రొఫైల్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్ లో విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య ప్రొఫైల్ ను ఎప్పటికప్పుడు తెలుసుకొని రక్తహీనత కంటి సమస్యలు ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స అందించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

రిజిస్ట్రేషన్, బ్లడ్ గ్రూపింగ్, బిపి,ఐటుకంటి పరీక్షలు, జనరల్ మెడికల్ చెకప్, హెల్త్ రికార్డుల నమోదు

ఈ కార్యక్రమం సర్పంచ్ తుమ్ కృష్ణారెడ్డి,మెడికల్ ఆఫీసర్ స్వరూపరాణి పర్యవేక్షణలో డాక్టర్ ఎం ఎల్ హెచ్ పి సౌజన్య, సూపర్వైజర్ సత్యమ్మ, సూపర్వైజర్ శ్రీధర్,ల్యాబ్ టెక్నీషియన్ రామస్వామి,నాగేంద్ర, ఏఎన్ఎంలుకవిత,గౌసియ సబ్ సెంటర్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభ్యుదయవాది కొప్పు నర్సింలు



**హత్నూర, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన సీనియర్ జర్నలిస్టు దివంగత కొప్పు నర్సింలు అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి అని డీజేఎఫ్ జిల్లా సలహాదారు మీనంపల్లి కిషన్‌రావు అన్నారు. గురువారం దౌల్తాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల జర్నలిస్టుల ఆధ్వర్యంలో నర్సింలు 10వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కిషన్‌రావు మాట్లాడుతూ కలాన్ని ఆయుధంగా మలుచుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. మానవీయ కోణంలో ఎన్నో కథనాలు రాశారని గుర్తుచేశారు.

కార్యక్రమంలో రామస్వామి, వెంకటేష్, ప్రభాకర్, వీరేశం, బిక్షపతి, సత్యం, పోచాగౌడ్, శ్రీనివాస్, నగేష్, దస్తగిరి, జావిద్, అబ్దుల్లా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సికింద్లాపూర్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యుత్ శాఖ సూపరింటెండెంట్



**శివ్వంపేట, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** గ్రామ అభివృద్ధికి విద్యుత్ శాఖ సహకారం అందిస్తుందని జిల్లా సూపరింటెండెంట్ నారాయణ నాయక్ తెలిపారు. తూప్రాన్ డీఈఈ దశరథ, ఏడీఈ శ్రీనివాస్, శివ్వంపేట ఏఈ నరేందర్‌తో కలిసి సికింద్లాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సర్పంచ్ దొంతి రెడ్డి అరుణ రెడ్డి గ్రామానికి సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్, 20 విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని కోరారు. దీనికి సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిబ్బంది వసతుల కోసం గదులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్, గ్రామ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో లైన్మెన్ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 24 నుంచి అక్టోబర్ 1 వరకు నిర్వహించనున్న వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్‌ను అదనపు జిల్లా కలెక్టర్ పాండు గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాల్లో వయోవృద్ధులందరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు.
కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు, సీనియర్ సిటిజన్లు ఖాజా మొయినుద్దీన్, హనుమప్ప, శ్రీశైలం, లక్ష్మయ్య, సంగప్ప, మల్లప్ప, సుధాకర్, ఉమాపతి, మధుకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగులో జిల్లాలోనే జహీరాబాద్ ఆదర్శం

- జిల్లాలో 4500 ఎకరాల్లో 1804 ఎకరాల సాగు జహీరాబాద్‌లోనే
- నేడు 70 ఎకరాల్లో పంట కోత, టన్ను ధర రూ.24 వేలు
- విక్రయించిన రైతుల ఖాతలోకి 5 రోజుల్లో జమ
- జహీరాబాద్ డివిజన్ ఉద్యానవనాధికారి సిహెచ్ పండరి






**40 శాతం జహీరాబాద్ డివిజన్ లోనే సాగు.... టన్ను ధర రూ:24 వేలు ........**

**న్యాల్‌కల్, సెప్టెంబర్ 24, (జనంసాక్షి):** ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులు మెరుగైన దిగుబడితో అధిక లాభాలు పొందవచ్చని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా ఉద్యానవన శాఖాధికారులు, సంబంధిత కర్మాగార యాజమాన్యం.. సాగు చేసిన, చేయనున్న రైతులకు పూర్తిగా సహాయ సహకారాలు అందించనున్నట్లు.. జహీరాబాద్ డివిజన్ ఉద్యానవన శాఖాధికారి సిహెచ్ పండరి సూచించారు. ఉద్యానవన అధికారుల సిబ్బంది, కర్మాగార యాజమాన్యం, సాగుచేసిన రైతుల బృందంతో కలిసి.. జహీరాబాద్ డివిజన్‌లోని న్యాల్‌కల్ మండలంలో కోతదశకు వచ్చిన మొదటి పంటను పరిశీలించి కోతను తీశారు.

2023 - 24 సంవత్సరము నుండి 2026 - 27 సాగు విస్తీర్ణం వరకు జిల్లాలో 4500 ఎకరాల మేర ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయగా.. ఒక్క జహీరాబాద్ డివిజన్‌లోని న్యాల్‌కల్, కోహీర్, మొగుడంపల్లి, జహీరాబాద్, ఝరాసంగం మండలాల్లో 452 గురు రైతులకు గాను 1804 ఎకరాల్లో పంటను సాగు చేశారు. ఈ మేరకు జిల్లాలోని 40 శాతం మేర పంటను సాగుచేశారు. ఈ మేరకు న్యాల్ కల్ తో పాటు మండలంలోని ముంగి, మెటల్ కుంట, మామిడిగి, గణేష్పూర్, హుసేల్లి గ్రామాల్లో కోత దశకు పంటను పరిశీలించి పంటను తీశారు. మండల కేంద్రంలో రైతు నాగభూషణం సంగన్న సాగుచేసిన ఆయిల్‌ఫామ్ పంట సాగులో ఇతర అంతర పంటల సాగును ఉద్యానవనాధికారులు పరిశీలించారు. గురువారం దాదాపు 70 ఎకరాల్లో పంటను కోసి గోవిందాపూర్‌లోని ఓ ప్రాంతానికి తరలించి.. అక్కడినుండి 24 గంటల్లోపు ఖమ్మం లోని ఆయిల్ ఫామ్ పరిశ్రమకు తరలించనున్నట్లు ఉద్యానవన అధికారి తెలిపారు. ఈ మేరకు టన్నుకు రూ:24 వేల, 25 రూపాయల చొప్పున.. స్మార్ట్ కార్డ్ పొందిన రైతుల ఖాతాల్లోకి ఐదు రోజుల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. తొలి కోత దశలో ఉద్యానవన, ప్రాజెక్టు సిబ్బంది విశ్వనాథ్, సాయి, గోపాల్, నవదీప్, రాజేష్, మోహన్, రైతులు సుంగన్న, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**టేక్మాల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు, బీజేపి లేబర్ సెల్ కన్వీనర్ నాయికోటి శామయ్య, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిరాములు, కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు వడ్డె రాములు, గిరిజన మోర్చా ఉపాధ్యక్షులు మోహన్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మదన్ రెడ్డి పాల్గొన్నారు.

## పిచ్చరగడి పాఠశాలను పరిశీలించిన అధికారులు

### పాఠశాల అభివృద్ధి పనులపై పరిశీలన.. సమస్యల పరిష్కారానికి చర్యలు





**కోహీర్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పిచ్చరగడి ఎంపీపీఎస్ పాఠశాలను గురువారం అధికారులు పరిశీలించారు. మండల విద్యాధికారి మహమ్మద్ జాకీర్ హుస్సేన్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్ రెడ్డి, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు కలిసి పాఠశాల ప్రాంగణాన్ని, భవన పరిస్థితులను పరిశీలించారు.
పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భవన స్థితిగతులు, అవసరమైన అభివృద్ధి పనులను అధికారులు పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన మౌలిక వసతులపై గ్రామ పెద్దలతో చర్చించి, అవసరమైన చర్యలు చేపట్టే అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య అందేలా పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల్లో ఆధ్యాత్మిక సందడి.. భక్తులకు అన్నదానం

## భక్తి శ్రద్ధలతో.. గణపయ్యకు ఘనవీడ్కోలు..



**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 24(జనంసాక్షి):** మండలవ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలు భక్తజన సందడితో కళకళలాడాయి. వివిధ సంఘాల ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు,ఉండ్రాళ్ల పాయసం వంటి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.మండలంలోని,గాధిర్యాల్ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి సర్పంచ్ మణికమ్మ,మాజీ సర్పంచ్,పి వెంకటరామిరెడ్డి, ముఖ్యఅతిథులుగా హాజరయ్యాయి. అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. విఘ్నేశ్వరుని కృపతో గ్రామంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.

**గణపయ్యకు ఘనవీడ్కోలు..**

గాధిర్యాల్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు విఘ్నేశ్వరుడికి, విశేష పూజలు నిర్వహించారు.
బుధవారం రాత్రి భక్తిశ్రద్ధల మధ్య, శోభయాత్ర నిర్వహించి గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.
మంగళవాయిద్యాలు, భక్తుల నినాదాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గణపయ్యకు లడ్డూను సమర్పించిన, బద్దుల ఈశ్వ రయ్యకు, వేలంపాటలో లడ్డూను సొంతం చేసుకున్న పారుపల్లి, నరసింహులుని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు జి.చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ బి.రామకృష్ణ, పి.నరసింహులు, బి. ఈశ్వరయ్య, టి.రాములు, ఎన్.గోపాల్, బచనోళ్ల కృష్ణయ్యతో పాటు యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## చిట్కుల్‌లో మేకల సంతకు పెరుగుతున్న ఆదరణ



**చిలప్‌చేడ్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** మండలంలోని చిట్కుల్ గ్రామంలో రెండు వారాల క్రితం ప్రారంభమైన మేకల సంతకు మంచి ఆదరణ లభిస్తోంది. ప్రతి వారం చుట్టుపక్కల గ్రామాల నుంచి గొర్రెల కాపరులు, మేకలు-గొర్రెల వ్యాపారులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మెదక్-జోగిపేట ప్రధాన రహదారికి సమీపంలో సంత ఏర్పాటు కావడంతో రవాణా సౌకర్యం అనుకూలంగా ఉందని గ్రామ పాలకవర్గం తెలిపింది.
పరిసర మండలాల ప్రజలకు కూడా సంత అందుబాటులో ఉండటంతో పశుపోషకులు, వ్యాపారులకు ప్రయోజనం కలుగుతోందని పేర్కొంది. చిలప్‌చేడ్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు సంతను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ పాలకవర్గం కోరింది.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**శివ్వంపేట, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** మండల పరిధిలోగల గుండ్లపల్లి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోడింగ్ కుమార్ మామ ఎల్లయ్య బుధవారం ఉదయం 10 గంటలకు ఇంటి పైకప్పు పైకి ఎక్కుతుండగా, జనావాసాల మధ్య వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ వైరు తగిలి కిందపడ్డాడు. ఇది గమనించిన స్థానికులు అతడిని వెంటనే మేడ్చల్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఎల్లయ్య మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని డిమాండ్ చేశారు.

# కొండారెడ్డిపల్లి పీహెచ్‌సీ పనులు అక్టోబర్ 5లోగా పూర్తి చేయాలి

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో నిర్మిస్తున్న నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవన నిర్మాణ పనులను అక్టోబర్ 5లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, అచ్చంపేట సబ్‌కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్ దేవసహాయం, సంబంధిత అధికారులతో కలిసి ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా భవన నిర్మాణ పురోగతి, ఇప్పటి వరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామగ్రి నాణ్యత, పనుల ప్రమాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, అవసరమైన చోట అదనపు సిబ్బంది, వనరులను వినియోగించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనులను త్వరగా పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ నాణ్యత



విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్దేశిత సాంకేతిక, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్మాణంలో వినియోగించే మెటీరియల్ నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. భవనం దీర్ఘకాలం మన్నికగా ఉండేలా పనులు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. పీహెచ్‌సీ భవనం పూర్తయిన వెంటనే ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా అవసరమైన అన్ని మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య సేవలకు అవసరమైన సదుపాయాలు, ఇతర వసతులు కూడా సమకూర్చా





లని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి, గడువు పొడిగింపులకు అవకాశం లేకుండా ముందస్తు ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## విద్యార్థులకు హెటెరో డ్రగ్స్ చేయూత

గుమ్మడిదల, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో హెటెరో డ్రగ్స్ కంపెనీ సహకారంతో విద్యార్థులకు డ్రెస్సులు, స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, షూస్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొరివి రాణి సురేష్ మాట్లాడుతూ.. గ్రామంలోని విద్యార్థులకు హెటెరో డ్రగ్స్ కంపెనీ అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సామగ్రిని అందించిన హెటెరో కంపెనీ యాజమాన్యానికి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా నల్లవల్లి గ్రామంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని హెటెరో యాజమాన్యాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలి

మద్దూరు, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): మద్దూరు మండలంలోని పట్టాదారు పాస్‌బుక్ కలిగిన రైతులందరూ రైతు రిజిస్ట్రీని తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎ. ప్రవీణ్ కుమార్ సూచించారు. ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ పథకాలు, పీఎం కిసాన్ ప్రయోజనాలు, భవిష్యత్తులో ఎరువుల బుకింగ్ వంటి సేవలకు రైతు రిజిస్ట్రీ కీలకమని తెలిపారు.

రైతులు పట్టాదారు పాస్‌బుక్, అవసరమైన వివరాలతో సమీప మీ-సేవ కేంద్రం లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి రిజిస్ట్రీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు.

## వినాయకుడి లడ్డూను దక్కించుకున్న ముస్లిం యువకుడు



మాగనూర్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): నేరడగం గ్రామంలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఘటన చోటుచేసుకుంది. శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం సమీపంలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూ వేలంలో ముస్లిం యువకుడు చాపల ఖాజా మైనుద్దీన్ రూ.26,001కు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఖాజా మైనుద్దీన్‌ను ఘనంగా సన్మానించారు. గ్రామంలో భక్తి, సోదరభావం, మత సామరస్యాన్ని చాటేలా ఈ కార్యక్రమం సాగింది. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, వినోద్, వై. మహేష్‌తో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## పెద్దఆదిరాల విద్యార్థినికి ప్రతిష్ఠాత్మక పురస్కారం



జడ్చర్ల, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): పెద్దఆదిరాల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని మలిపెద్ది ఆరాధ్య పదో తరగతి (2025-26)లో 577 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ అందించిన రూ.2 లక్షల నగదు బహుమతి చెక్కు, మెమెంటోను గురువారం రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆరాధ్యకు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ విద్యార్థినిని అభినందించి, ఉన్నత విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. మల్లయ్య, ఉపాధ్యాయులు బి. వెంకటయ్య పాల్గొన్నారు. ఆరాధ్య ప్రతిభపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## సింగపూర్ విద్యా విధానాలను పాఠశాలల్లో అమలు చేయాలి



గుండుమాల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): సింగపూర్‌లో ఐదు రోజుల టీచర్స్ ఎక్స్‌పోజర్ విజిట్, ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసుకుని నారాయణపేటకు తిరిగొచ్చిన జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) కే.విద్యాసాగర్‌కు ఘన సత్కారం లభించింది. గురువారం గుండుమాల్ మండల ప్రాథమిక పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం పరిశీలించి, లోపాలను గుర్తించి సమర్థవంతమైన రెమిడియేషన్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధచూపి, వారి అవసరాలకు అనుగుణంగా సహకారం అందించాలన్నారు. పాఠశాలల్లో అమలవుతున్న ఉత్తమ బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు పరస్పరం పంచుకోవడం ద్వారా సహకార అభ్యాసాన్ని బలోపేతం చేయాలని సూచించారు.

సింగపూర్ పర్యటనలో గమనించిన విద్యార్థి కేంద్రిత బోధన, ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి, పాఠశాల నాయకత్వం, అభ్యాస ఫలితాల మెరుగుదలకు అనుసరిస్తున్న విధానాలను వివరించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఉపయోగపడే ఉత్తమ విధానాలను మన పాఠశాలల్లోనూ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ శేఖర్‌రెడ్డి, ఎంఆర్‌పీలు రాఘవేందర్, గీత, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ



కంగ్టి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): మండలంలోని చాప్ట (కే)లో తాళం వేసిన ఇంట్లో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన శేరి నాగ్‌గొండ కుటుంబ సభ్యులతో కలిసి హనుమాన్ గణేష్ మండపం వద్ద భజన కార్యక్రమానికి వెళ్లారు. ఇదే అదనుగా దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని రెండు తులాల బంగారం, 50 తులాల వెండి, రూ.25 వేల నగదును అపహరించారు. తెల్లవారుజామున 3 గంటలకు ఇంటికి చేరుకున్న నాగ్‌గొండ తాళం పగిలి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ దుర్గారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంబీబీఎస్ సీటుతో గుర్జివాడకు గర్వకారణం



కోహీర్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): మండలంలోని గుర్జివాడకు చెందిన పాస్టర్ యేసు రత్నం కుమార్తె శ్రీజ నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించారు. వైద్యురాలిగా ఎదగాలనే లక్ష్యంతో పట్టుదలగా చదివిన శ్రీజ, 2024లో హైదరాబాద్‌లో నీట్ కోచింగ్ తీసుకుని, 2025లో ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఆమె విజయాన్ని అభినందిస్తూ కోహీర్ మున్సిపల్ కౌన్సిలర్ ఎన్. సంపత్‌కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు.


## వయోవృద్ధుల కోసం 25న ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు

వనపర్తి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీలు) ఈ నెల 25న వయోవృద్ధుల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి తెలిపారు.

గ్రామాల వారీగా వయోవృద్ధులు తమకు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వయోవృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

శిబిరాలను వయోవృద్ధులు సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కోరారు.

## నేడు శ్రీ అనంతపద్మనాభ వ్రతం



మల్దకల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వయంభూగా వెలసిన శ్రీ అనంతపద్మనాభ స్వామి వ్రతం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణమాన్య పట్వారి ప్రహ్లాద రావు,ఈవో సత్య చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయంలో పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించి అనంతరం అనంతపద్మనాభ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## గండీడ్ మండల టీఎస్‌సీపీఎస్‌ఈయూ నూతన కమిటీ ఎన్నిక

గండీడ్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి): గండీడ్ మండల టీఎస్‌సీపీఎస్‌ఈయూ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దోమ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇబ్రహీంబాద్ కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఎన్నికల అధికారులుగా రాఘవేంద్రరావు, రామానుజం వ్యవహరించారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు కేఎం చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేశం, సీపీఎస్ ఉపాధ్యక్షురాలు రాధిక, జిల్లా నాయకులు పాల్గొన్నారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల మండల నాయకులు, సీపీఎస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు



నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

# మంత్రి వాకిటి శ్రీహరి గారికి మర్యాద ఇచ్చి మాట్లాడాలి

- తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్



**అమరచింత, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ పక్కన ఫంక్షన్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ కేశవ్ నాగరాజు గౌడ్ పత్రికా విలేకరులతో సమావేశంలో నిర్వహించారు ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మంత్రివర్యులు వాకిటి శ్రీహరి పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదుఆయన వ్యక్తిగతంగా దూషించడం సబబు కాదని మక్తల్ నియోజకవర్గంలో ఏవైనా సమస్యలుంటే మంత్రి ద్వారా నియోజకవర్గం అభివృద్ధి కోసం మంత్రి కృషి దగ్గర దగ్గర 2000 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. మీరు ఏమైనా సమస్యలు ఉంటే సలహాలు ఇస్తే బాగుంటది అని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన బీసీ వాడని ఆయనను అవమానించే విధంగా మాట్లాడడం సరి అయింది కాదని ఇప్పటికైనా తన ఆలోచనలను సమాజానికి పనికొచ్చే విధంగా తన విధానాలను మార్చుకోవాలని వ్యక్తిగత దూషణలు చేయడం మానుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు రవికాంత్ రవి యాదవ్ మార్కెట్ మెంబర్ కమలాకర్ గౌడ్ భగవంతు రెడ్డి జగన్ రెడ్డి ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్లు తో పాటు కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



రోగుల రద్దీకి అనుగుణంగా సిబ్బంది షిఫ్టులను పునర్వ్యవస్థీకరించాలని, ఉదయం, సాయంత్రం వేళల్లో అవసరాలను బట్టి విధులు కేటాయించాలని తెలిపారు. సబ్‌సెంటర్లలో MLHP\T నిర్దేశిత రోజుల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పీహెచ్‌సీ వైద్యాధికారులు వాటిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుని సబ్‌సెంటర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు.
నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) స్క్రీనింగ్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆశా కార్యకర్తలకు గ్రామాల వారీగా లక్ష్యాలు నిర్దేశించి పురోగతిని పర్యవేక్షించాలని, అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులను ప్రారంభ దశలో గుర్తించి చికిత్స అందేలా చూడాలని సూచించారు.
ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన బాలికలకు HPV టీకాపై అవగాహన కల్పించి కార్యక్రమాన్ని లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. HMISలో టీబీ కేసుల నమోదు, చిన్నారుల టీకాలు, SHG సభ్యుల ఆరోగ్య స్క్రీనింగ్, సాధారణ, సిజేరియన్ ప్రసవాల వివరాలను పీహెచ్‌సీల వారీగా సమీక్షించారు. డెంగ్యూ, కుష్టు, టీబీ కేసులు, కంటి పరీక్షల శిబిరాలు, సబ్‌సెంటర్ల నిర్మాణాలు, మరమ్మతుల పురోగతిని కూడా పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి.మధుసూదన్ నాయక్, డీఎంహెచ్‌వో డా.ఏ.శ్రీనివాసులు, వైద్యాధికారులు, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

# సెరికల్చర్ వైపు రైతులు మళ్లాలి

కోస్లి ప్రాంతానికి హైదరాబాద్ నుంచి రేడియల్ రోడ్ అందుబాటులోకి రానున్న నేపథ్యంలో సెరికల్చర్‌ను విస్తరించి రీలింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే మార్కెట్ అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు 100 మంది రైతులు సెరికల్చర్‌పై ఆసక్తి చూపుతున్నారని, వచ్చే సీజన్‌లో మల్బరీ సాగు చేపట్టేందుకు వారు ముందుకు వచ్చినట్లు తెలిపారు. డ్రిప్ సదుపాయం, మల్బరీ మొక్కలు, ఇతర అవసరమైన సామగ్రిని శాఖల సమన్వయంతో అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.
అహింసా సిల్క్‌కు మార్కెట్‌లో ప్రత్యేక డిమాండ్ ఉందని, ఈ-కామర్స్ ద్వారా దేశ, అంతర్జాతీయ మార్కెట్లలో ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సెరికల్చర్ సాగు చేస్తున్న రంగారెడ్డి జిల్లా ప్రాంతాలకు రైతులను అధ్యయన పర్యటనకు తీసుకెళ్లి సాగు, సాంకేతికత, మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. చాకీ సెంటర్ల ఏర్పాటుకు మహిళా సంఘాల సభ్యులను ప్రోత్సహిస్తామని, స్థానికంగా శిక్షణతో పాటు అవసరమైతే మైసూరులో మూడు నెలల శిక్షణ ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సెరికల్చర్ విస్తీర్ణాన్ని పెంచి రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సాయిబాబా, సెరికల్చర్ డీడీ నాగరత్న, ఏడీలు విజయ్‌కుమార్, మహిపాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన విద్యార్థులు









**నవాబ్‌పేట, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** నవాబ్‌పేట మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటనలో భాగంగా సందర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వ పరిపాలన, ప్రజలకు అందించే సేవలు, స్థానిక వృత్తులు, పరిశ్రమలపై ప్రాయోగిక అవగాహన కల్పించడమే ఈ పర్యటన ఉద్దేశమని ఉపాధ్యాయులు తెలిపారు.
పర్యటనలో భాగంగా విద్యార్థులు మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, విద్యుత్ శాఖ కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు. ఆయా కార్యాలయాల్లో అధికారులు, సిబ్బందిని కలిసి విధులు, ప్రజలకు అందించే సేవలు, కార్యాలయాల పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ శాఖలు ప్రజలకు ఎలా సేవలు అందిస్తున్నాయి. వివిధ సమస్యల పరిష్కారానికి ఎలాంటి విధానాలు అమలు చేస్తున్నారనే అంశాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది అందించిన సమాచారాన్ని విద్యార్థులు తమ డైరీల్లో నమోదు చేసుకున్నారు. అనంతరం వినాయక చవితిని పురస్కరించుకుని స్థానికంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల తయారీ కేంద్రాన్ని విద్యార్థులు సందర్శించారు. విగ్రహాల తయారీకి ఉపయోగించే ముడిపదార్థాలు, తయారీ విధానం, కళాకారుల నైపుణ్యాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. విగ్రహాల రూపకల్పన నుంచి తుది తయారీ వరకు వివిధ దశలను పరిశీలించారు.
విద్యార్థులు లక్ష్మణ్, సాయి, వెంకట్‌రెడ్డి, రాధాకృష్ణ, అనూరాధ, నర్మద తదితరులు ఈ క్షేత్ర పర్యటనలో పాల్గొన్నారు. పాఠ్యాంశాలతో పాటు ప్రత్యక్ష అనుభవం ద్వారా ప్రభుత్వ వ్యవస్థలు, సమాజం, స్థానిక వృత్తులపై అవగాహన పెంపొందించుకోవడానికి ఇటువంటి పర్యటనలు దోహదపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

# నకిలీ నంబర్ ప్లేట్‌తో వాహనం లభ్యం..

- ఇద్దరిపై కేసు నమోదు
- చాసిస్ నంబర్ పరిశీలనతో అసలు విషయం వెలుగులోకి




**కౌడిపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** ధర్మసాగర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నకిలీ నంబర్ ప్లేట్‌తో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు కౌడిపల్లి ఎస్ఐ అమర్ తెలిపారు.
ఎస్ఐ అమర్ వివరాలు వెల్లడిస్తూ.. సిబ్బందితో కలిసి ధర్మసాగర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా జంగం శ్రీశైలం, రవీందర్ యాక్టివా వాహనంపై వచ్చినట్లు తెలిపారు. వాహన నంబర్ ప్లేట్‌పై ఉన్న నంబర్‌కు సంబంధించిన చలాన్ల వివరాలను పరిశీలించగా సమాచారం లభించలేదన్నారు. దీంతో అనుమానం వచ్చి వాహనం చాసిస్ నంబర్ ఆధారంగా వివరాలు సేకరించగా, చాసిస్ నంబర్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ నంబర్ వేరుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అసలు వాహన యజమానికి శ్రీశైలం, రవీందర్‌లతో ఎలాంటి సంబంధం లేదని విచారణలో తేలిందని తెలిపారు. నకిలీ నంబర్ ప్లేట్ ఉపయోగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్ పేర్కొన్నారు.

# ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు




**మల్దకల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల ఆవరణలో శ్రమదానం చేసి ముళ్లపొదలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ 1969 సెప్టెంబర్ 24న మహాత్మా గాంధీ స్ఫూర్తితో ఎన్ఎస్ఎస్ ఏర్పాటైందని తెలిపారు. సమాజ సేవ ద్వారా యువతలో నైపుణ్యాలు, సేవా భావం పెంపొందించడమే లక్ష్యమన్నారు. ప్రత్యేక శిబిరాల ద్వారా మూఢనమ్మకాలు, బాలకార్మిక వ్యవస్థ, వ్యాధులు, మత్తుపదార్థాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు రామాంజనేయులు గౌడ్, నరసింహులు, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పించాలి

## గుండుమల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**గుండుమాల్, సెప్టెంబర్ 24(జనంసాక్షి):** గుండుమల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం చేస్తున్న బాలికల వద్దకు వెళ్లి భోజనం నాణ్యత, రుచిగా ఉందా లేదా, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అనే విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.
అనంతరం విద్యార్థుల విద్యాభ్యాసంపై కలెక్టర్ ఆరా తీశారు. పాఠశాలలో కంప్యూటర్లు అందుబాటులో ఉన్నాయా, వాటిపై ఎలాంటి శిక్షణ పొందుతున్నారు, డ్రాయింగ్‌తో పాటు ఇతర అంశాల్లో ఏమేమి నేర్చుకుంటున్నారు, ఫిజిక్స్ తదితర సబ్జెక్టుల బోధన ఎలా జరుగుతోందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.
పాఠశాల ప్రహరీ గోడ అక్కడక్కడా కూలిపోవడంతో బయటి నుంచి పశువులు, ఇతర జంతువులు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ ప్రహరీ గోడ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయించాలని ఆదేశించారు.
అనంతరం అదే పాఠశాల ఆవరణలోని జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. కళాశాలలో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సెకండ్ ఇయర్ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. సెకండ్ ఇయర్ పూర్తయిన అనంతరం ఉన్నత విద్యలో ఏ కోర్సులు చదవాలనుకుంటున్నారు, భవిష్యత్‌లో ఏ రంగంలో స్థిరపడాలనుకుంటున్నారు అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.
రోడ్డు విస్తరణలో భాగంగా ప్రాథమిక పాఠశాలకు చెందిన మరుగుదొడ్లు తొలగిపోయాయని, విద్యార్థుల సౌకర్యార్థం కొత్త మరుగుదొడ్లు నిర్మించాలని ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ రెండు రోజుల్లో పంచాయతీరాజ్ ఈఈని పంపించి పరిస్థితిని పరిశీలింపజేస్తానని తెలిపారు. కొత్త మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఫైల్ రూపొందించాలని సూచించారు. ప్రతిపాదనలు సిద్ధమైన అనంతరం కడ నిధులతో కొత్త మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# జీ-రామ్‌జీతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు

## గ్రామాల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా సర్పంచులు పనిచేయాలి: కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో నూతనంగా అమలు చేస్తున్న విక్షిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్-జీ-రామ్‌జీ పథకం ద్వారా గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు.

గురువారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లాలోని సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణ, అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పథకం అమలుపై పలు సూచనలు చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు శాశ్వత ఆస్తులు, మౌలిక వసతులు అభివృద్ధి చేయడమే జీ-రామ్‌జీ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ప్రజలకు అత్యవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

పథకం కింద 375 రకాల పనులు చేపట్టేందుకు అవకాశం ఉన్నందున మార్గదర్శకాలు, నిబంధనలను సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు, అధికారులు పూర్తిగా తెలుసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టరాదని స్పష్టం చేశారు.

తాగునీరు, పారిశుద్ధ్యం, నీటి సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతులు, సహజ వనరుల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. చేపట్టే ప్రతి పని నాణ్యతా ప్రమాణాలతో, శాశ్వత ప్రయోజనం కలిగేలా ఉండాలని తెలిపారు. పనుల అమలులో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

పథకం అమలులో ప్రతి దశలో పారదర్శకత పాటించాలని, పనుల వివరాలు, ఖర్చులు, పురోగతిని నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. నిధులను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాలని, ప్రజలకు సమాచారం అందుబాటులో ఉంచాలన్నారు. అర్హులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు స్థానిక మానవ వనరులను గ్రామాభివృద్ధికి వినియోగించుకోవాలని తెలిపారు.

సర్పంచ్‌లు, పంచాయతీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని కలెక్టర్ సూచించారు. అనంతరం అధికారులు పనుల ఎంపిక, ఆమోద ప్రక్రియ, నిర్వహణ. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, డీపీఓ శ్రీరాములు, అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి యశ్వంత్‌రావు, 460 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## జడ్చర్లలో వైభవంగా ముగిసిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర





**జడ్చర్ల, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
జడ్చర్ల పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర బుధవారం భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో వైభవంగా ముగిసింది. వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు వేలాదిగా తరలివచ్చి శోభాయాత్రలో పాల్గొని గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సిగ్నల్ గడ్డ పూలే-అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ స్వాగత తోరణం ఏర్పాటు చేసి భక్తులకు స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు గుండెమోని శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ అందరి సహకారంతో నిమజ్జన వేడుకలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సహకరించిన ముదిరాజ్ కులబంధువులు, పుర ప్రముఖులు, మండపాల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పిట్టల మురళి, మాజీ ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## D25 కాలువ పూడిక పనులు ప్రారంభం



**అమరచింత, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
గురువారంమండల పరిధిలోని భూత్పూర్ కెనాల్ డి 25 కాలువలో పేరుకుపోయిన జమ్మూ పూడికను తీయడానికే తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్ కెనాల్ పూడిక పనులను ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్నో పథకాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందు వరసలో ఉందని మంత్రివర్యులు వాకిటి శ్రీహరి రైతు సంక్షేమం కోసమే కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజేందర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు రవికాంత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జింక రవి యాదవ్ కమలాకర్ గౌడ్ జగన్ రెడ్డి శ్రీనివాసులు భగవంతు రెడ్డి తెలుగు రమేష్ మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముండ్ల కంప చెట్లను తొలగించిన సర్పంచ్



**మల్దకల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని కుర్తిరావుల చెరువు గ్రామం నుండి మల్దకల్ మెయిన్ రోడ్డు వరకు గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్ కె భగవంతు సొంత ఖర్చులతో బిటి రోడ్డు ప్రక్కన ఉన్నటువంటి ముళ్ళ కంపచెట్లను చెత్తాచెదారాన్ని డోజర్ సహాయంతో క్లీన్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పటేల్ శ్రీనివాస్ రెడ్డితో పాటు ఉపసర్పంచ్ దేవమ్మ,వార్డు మెంబర్లు బసన్ గౌడ్,రాఘవేంద్ర రెడ్డి, బుడ్డన్న,దేవన్న,వెంకటన్న, పంచాయతీ కార్మికుడు నాగన్న,రామన్ గౌడు, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం....

- 56 వేలు పలికిన లడ్డు ధర



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించిన ఆయా వినాయక మండపాల నిర్వాహకులు గురువారం వినాయకులను ఘనంగా వినాయక నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ప్రత్యేక వాహనాలలో గణనాథులను ఉంచి పట్టణ పురవీధుల గుండా భాజా భజంత్రీలతో .. భజన కీర్తనలు చేస్తూ యువకులు నృత్యాలు చేస్తూ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద లడ్డూ ను వేలం పాటలో పురం రాజు 56వేలకు దక్కించుకున్నారు. పేట పట్టణ సమీపంలోని తిరుమలాపూర్ చెరువులో గణనాథులను నిమజ్జనం చేశారు..

## 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

- కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఈ నెల 27న ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సంగారెడ్డి ఫ్రూట్ రీసెర్చ్ స్టేషన్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం నిర్వహించి, విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## బురదమయంగా సింగూరు రహదారి

- గుంతలతో వాహనదారుల అవస్థలు



**పుల్కల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని డీసీసీబీ బ్యాంకు సమీపంలో సింగూరు ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడి, ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాటిలో నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో వాహనాలు గుంతల్లో దిగడంతో పాటు అదుపుతప్పే పరిస్థితి నెలకొంది.ప్రధాన రహదారి కావడంతో నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు,కార్లు,ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతలు సరిగా కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

## నిడ్జింత వినాయకుడి లడ్డూకు రూ.55,555



**కొత్తపల్లి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
మండలంలోని నిడ్జింత గ్రామంలో వినాయకుడి లడ్డూకు రూ.55,555 ధర పలికింది. మంగళవారం హనుమాన్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన చెన్నూరు చంద్రశేఖర్‌రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. వినాయకుడికి సమర్పించిన ఆపిల్‌ను మల్కాపురం రఘుపతిరెడ్డి రూ.16 వేలకు కొనుగోలు చేశారు. 1999 నుంచి గ్రామంలో లడ్డూ వేలం నిర్వహిస్తున్నారు. తొలిసారి ఈడిగి లలిత రూ.100కు లడ్డూను దక్కించుకున్నారు. అప్పటి నుంచి నిర్వహిస్తున్న వేలాల ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.27 లక్షలు సమకూరినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మొత్తంతో గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సంప్రదాయం భక్తి, గ్రామస్థుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు.

## సంతోష్ శెట్టిని పరామర్శించిన ప్రశాంత్ రెడ్డి



**కృష్ణ, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
కృష్ణ మండలం గుడెబల్లూర్‌కు చెందిన సోమ సంతోష్ శెట్టి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న నారాయణపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ వెంకట్ రాములు చారి, యూత్ కాంగ్రెస్ నాయకుడు అరవింద్, మండల అధ్యక్షుడు విజయ్ గౌడ్, షేక్ సర్వరాజు, బసప్ప సౌకారి తదితరులు పాల్గొన్నారు.

# పట్టు పరిశ్రమతో స్థిరమైన ఆదాయం

## ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ప్రియాంక

**గుండుమాల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** రైతులు పట్టు పరిశ్రమను ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా స్వీకరించి వ్యవసాయ ఆదాయాన్ని పెంచుకోవాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సి.ప్రియాంక సూచించారు. గురువారం గుండుమాల్ రైతువేదికలో పట్టు పరిశ్రమ సాగు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకం కేంద్రాలు, చాకీ కేంద్రాలు, మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**రెండు ఎకరాల యూనిట్‌కు రూ.5.62 లక్షల సబ్సిడీ**

రెండు ఎకరాల్లో పట్టు పరిశ్రమ యూనిట్ ఏర్పాటుకు రూ.7.50 లక్షల వరకు వ్యయం కాగా, సాధారణ రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా 75 శాతం, అంటే రూ.5.625 లక్షల వరకు సబ్సిడీ లభిస్తుందని అధికారులు తెలిపారు. రైతు వాటా 25 శాతం ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం వరకు ప్రభుత్వ సహాయం అందుతుందని వివరించారు. ఈ నిధులతో మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకం షెడ్లు, పరికరాలు, చాకీ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

**రేడియల్ రోడ్డుతో మార్కెటింగ్‌కు ఊతం**

గుండుమాల్ ప్రాంతంలో రేడియల్ రోడ్డు పనులు పూర్తయితే రవాణా, మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపడతాయని కలెక్టర్ తెలిపారు. పట్టు గూళ్లను మార్కెట్లకు సులభంగా తరలించి మెరుగైన ధరలు పొందే అవకాశం ఉంటుందన్నారు. పట్టు పరిశ్రమ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తుందని చెప్పారు.

మల్బరీ సాగు విధానం, తోటల నిర్వహణ, శాస్త్రీయ పద్ధతులు, బిందు సేద్యానికి రాయితీలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. పట్టు పరిశ్రమతో పాటు పశుపోషణ, మేకలు, కోళ్ల పెంపకం, పశుగ్రాస సాగు వంటి అనుబంధ కార్యకలాపాలను సమగ్రంగా చేపట్టి స్థిరమైన ఆదాయం పొందవచ్చని సూచించారు.

కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారులు నాగరత్న, మహిపాల్, విజయ్‌కుమార్, ఉద్యానశాఖ అధికారి సాయిబాబా, వ్యవసాయ అధికారులు రామకృష్ణ, రేష్మారెడ్డి, మండల ప్రత్యేక అధికారి రంగారావు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.





## భారీ వర్షానికి కూలిన ఇల్లు.. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

- బీఆర్ఎస్ వార్డు ఇంచార్జి శివగారి అంజయ్య



**చేర్యాల, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** చేర్యాల పట్టణంలోని 12వ వార్డులో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి శనిగారి శ్రీనివాస్ ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ 12వ వార్డు ఇంచార్జి శివగారి అంజయ్య వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కూలిపోయిన ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేర్యాల మున్సిపాలిటీకి ఎటువంటి నిధులు ఇవ్వలేదని, ఇది చాలా విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన నిధులు తప్ప ప్రస్తుత ప్రభుత్వం మున్సిపాలిటీకి ఒరగబెట్టిందేమి లేదని విమర్శించారు.

## ప్రమాదవశాస్తూ బస్సు కింద పడి విద్యార్థిని మృతి



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** ప్రమాదవశాస్తు బస్సు టైర్ కిందపడి ఓ విద్యార్థిని మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. మండల పరిధి జంగారాయి గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన బొమ్మర బోయిన కృష్ణ-లావణ్య దంపతుల మూడవ కుమార్తె కీర్తన(6) చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని సరస్వతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో యూకేజీ చదువుతుంది. గురువారం సాయంత్రం బస్సులో తిరిగి ఇంటికి వస్తూ ,తన ఇంటి దగ్గర బస్సు ఆగడంతో కీర్తన బస్సు దిగి ముందుకు నడుస్తుండగా, బస్సు డ్రైవర్ వెనకాల కి టర్న్ చేస్తూ ముందుకు తీయగా బస్సు బంపర్ తాకి వెనుక టైర్ కింద పడి పోగా తీవ్ర గాయాలైన కీర్తనను ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు చూసి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్టు తెలిపారు.

## అత్తాపూర్ పోలీసుల వైఖరికి నిరసనగా కోర్టు విధుల బహిష్కరణ



**నారాయణపేట సెప్టెంబర్ 24(జనంసాక్షి):** అత్తాపూర్ పోలీసులు మహిళా న్యాయవాదులపై అనుచితంగా ప్రవర్తించదన్ని నిరసిస్తూ గురువారం నారాయణపేట జిల్లా కోర్టు సముదాయంలో నీ అన్ని కోర్టులలో న్యాయవాదులు విధులనుబహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి మాట్లాడుతు మహిళా న్యాయవాదులపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్‌లో తాగునీటి సమస్యకు పరిష్కారం

**నూతన బోర్ మోటార్ ఏర్పాటు చేసిన సర్పంచ్ సుజాత**



**కొల్చారం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గత రెండు రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యకు గ్రామపంచాయతీ అధికారులు పరిష్కారం చూపించారు. సర్పంచ్ కన్నెబోయిన సుజాత ఆధ్వర్యంలో నూతన బోర్ మోటార్‌ను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో గ్రామస్థులకు నీటి ఇబ్బందులు తొలగాయి.

## గాలి దుమారం బీభత్సం రోడ్డుపై విరిగిపడిన చెట్టు



**చేర్యాల, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** చేర్యాల మండలంలోని పలు గ్రామాలలో గురువారం సాయంత్రం వర్షంతో కూడిన ఈదురు గాలులకు మండలంలోని ఆకునూరు గ్రామ ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో రహదారిపై చెట్టు విరిగి రోడ్డుపై పడింది. ఆటో యూనియన్ నాయకులు, గ్రామస్తులు కలిసి ట్రాక్టర్ సహాయంతో అక్కడి నుండి తొలగించారు.

## చిరుతల సంచారం..పశువులపై దాడి

### గేదెను చంపి తిన్న చిరుతలు..భయాందోళనలో తండావాసులు

**గండీడ్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** గండీడ్ మండలంలోని మన్సూర్‌పల్లి, రెడ్డిపల్లి, కొండాపూర్, అశిరెడ్డిపల్లి గ్రామాల సమీపంతో పాటు హన్వాడ మండలం ఎల్లంబాయి తండా పరిసరాల్లో చిరుతల సంచారం కలకలం రేపుతోంది. ఎల్లంబాయి తండాకు చెందిన రైతు నున్నావత్ హన్మంతు, గేదెను బుధవారం రాత్రి చిరుతలు చంపి తిన్నట్లు రైతులు తెలిపారు. కొన్ని నెలలుగా చిరుతల సంచారంపై అటవీశాఖకు సమాచారం ఇచ్చినా స్పందన లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు పాదముద్రలు,కదలికలను గుర్తించి ట్రాకింగ్ చేపట్టి,అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.పశువులను కోల్పోయిన రైతులకు ప్రభుత్వ నిబంధనల మేరకు నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



# గ్రామాభివృద్ధికి పంచాయతీ ప్రణాళికలు: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా ప్రణాళికలు ఉండాలి
- 7 మండలాల సర్పంచులు, అధికారులకు శిక్షణ







**మహబూబ్‌నగర్, బ్యూరో సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను గ్రామ పంచాయతీ వారీగా రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. కలెక్టరేట్‌లో బాలానగర్, హన్వాడ, గండీడ్, మహబూబ్‌నగర్, మహ్మదాబాద్, మిడ్జిల్, నవాబ్‌పేట్ మండలాల సర్పంచులు, ఎంపీడీవోలు, కార్యదర్శులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు

అక్టోబర్ 1 నుంచి 2027 జూన్ వరకు గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించి, అక్టోబర్ 2న గ్రామసభల్లో ఆమోదం పొందాలని సూచించారు. వచ్చే మూడేళ్లకు దీర్ఘకాలిక ప్రణాళిక కూడా సిద్ధం చేయాలని, ఈ నెల 30లోగా ప్రణాళికలు సమర్పించాలని ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, నీటి కొరతను ముందుగానే అంచనా వేసి ఎదుర్కొనేలా ప్రణాళికలు ఉండాలని, చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకులు, రీచార్జ్ బోర్‌వెల్లు, సోక్ పిట్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫామ్ పాండ్లను చేపల పెంపకం, పశుపోషణకు ఉపయోగించేలా చూడాలన్నారు.

నీటి సంరక్షణ, మౌలిక వసతులు, జీవనోపాధి, వర్షాభావ నివారణ అనే 4 ప్రధాన రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాల భవనాలు, అంగన్‌వాడీలు, డ్రైనేజీ, తాగునీరు వంటి అవసరాలను ప్రణాళికలో చేర్చాలని సూచించారు.

మంచి పనితీరు కనబరిచే పంచాయతీలను గణతంత్ర దినోత్సవం రోజు సత్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జెడ్పీ సీఈఓ వెంకట్ రెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలి

- **అక్టోబర్ 1 నుంచి కొనుగోలు కేంద్రాల ప్రారంభం: అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్**



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** ఖరీఫ్ (వానాకాలం) 2026-27 వరి ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్ అధికారులను ఆదేశించారు. గురువారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అక్టోబర్ 1 నుంచి ప్రారంభించాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, వేయింగ్ స్కేల్స్, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు, గన్నీ బ్యాగులు తదితర సామగ్రిని ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం రాకకు అనుగుణంగా అవసరమైన హమాలీ కార్మికులను సిద్ధంగా ఉంచాలన్నారు. పౌరసరఫరాల శాఖ, కొనుగోలు సంస్థలు గోదాములు, నిల్వ ప్రదేశాలను ముందుగానే గుర్తించి వాటి సామర్థ్యం, అదనంగా అవసరమైన నిల్వ వివరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

లోతట్టు, వరద ముంపు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా సురక్షిత ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించారు. సన్నరకం ధాన్యం కోసం ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ మండలాల వారీగా పంట కోతల షెడ్యూల్ రూపొందించి, గ్రామాల వారీగా ధాన్యం కొనుగోలు అంచనాలను ముందుగానే అందించాలన్నారు.

రైతులు తీసుకొచ్చే ధాన్యంలో నిర్దేశిత తేమ, నాణ్యత ప్రమాణాలు ఉండేలా అవగాహన కల్పించాలని, ప్రమాణాలకు అనుగుణమైన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం కేంద్రాల్లో పేరుకుపోకుండా సకాలంలో తరలించేందుకు రవాణా, నిల్వ ఏర్పాట్లను సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

రైతులకు తాగునీరు, నీడ, షెడ్లు, కూర్చునే సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అవసరమైనన్ని లారీలను ముందుగానే సమకూర్చుకోవాలని, ఎస్‌డబ్ల్యూసీ, ఏఎంసీ గోదాములు, ఇతర ప్రభుత్వ నిల్వ సౌకర్యాలను వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత, నాణ్యత, సకాలంలో ధాన్యం తరలింపునకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

# పేట జిల్లా పిఆర్‌టియు అధ్యక్షులుగా యాద్గిర్ జనార్దన్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



**నారాయణపేట, సెప్టెంబర్ 24(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్ లో జరిగినపిఆర్టియుటిఎస్ జిల్లా సర్వసభ్య కౌన్సిల్ సమావేశంలో నారాయణ పేట జిల్లా అధ్యక్షులుగా యాద్గిర్ జనార్దన్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా పల్లె వెంకట్ రెడ్డి గౌరవ అధ్యక్షు లుగా ఏం రఘువీర్ ఏకగ్రీవంగాఎన్నికయ్యారు.అలాగే జిల్లా కార్యవర్గంలో 20 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పి ఆర్టి యు టి ఎస్ రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ ఎన్నికల అధికారులుగా వికారాబాద్ జిల్లా అధ్య క్షులు కడియాల చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి దోమ అమర్నాథ్ పరిశీలకులుగా భీమప్ప, యాదయ్య హాజ రు అయ్యారు.ఈ కార్య క్రమంలో పాల్గొన్న జిల్లా లోని అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యద ర్శులు కౌన్సిల్ సభ్యులు గత రెండు సంవత్సరాల కాలంలోయాద్గిర్ జనార్దన్ రెడ్డి పల్లె వెంకట్ రెడ్డి సంఘ నిర్మాణం కోసం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేయ డం వలన వారిని మరల 2026- 28 సంవత్సరాలకు గాను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందనీ పేర్కొన్నా రు.

నూతనంగా ఏర్పడిన జిల్లా కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వము దసరాకు కేవ లం రెండు డిఏలు ఇవ్వడా న్ని అసంతృప్తి వ్యక్తం చేశా రు. ప్రభుత్వము వెంటనే పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు . అదే విధంగా రాబోవు రెండు సంవత్సరాల కాలంలో 317 జీవో పరిష్కారం మీద పోరాటం చేస్తామని తీర్మా నం చేశారు. కాంట్రిబ్యూటర్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయకపోతే పెద్ద మొత్తం లో ఉద్యమం తీవ్రతరం చేస్తామని,అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి నారాయణ పేట జిల్లాకు విద్యా వాలంటీర్లను తీసు కురావడానికి త్వరితగతిన కార్యాచరణ జరుగుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో నాణ్య మైన విద్యను అందించుటకు కృషి చేయాలని సంఘ ము ద్వారా సమస్యల పరిష్కారం కోసము పనిచేస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా పలు తీర్మానాలను చేయడం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన జనర్దన్ రెడ్డి గత 24 సంవ త్సరాలుగా సంఘంలో అంకితభావంతో పనిచేస్తూ సంఘము కోసము ఉపా ధ్యాయుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేస్తూ కృషి చేస్తున్నారని రాష్ట్ర సంఘ ప్రధాన కార్య దర్శి సుంకరి బిక్షం గౌడ్ పేర్కొంటూ ఇలాంటి నాయ కుడిని ఏకగ్రీవంగా ఎన్నుకో వడం శుభసూచకమని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కౌన్సిల్ సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పి.నర సింహారెడ్డి, తాజా మాజీ జిల్లా గౌరవ అధ్యక్షులు తిరుపతి వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శు లు సత్యనారాయణ రెడ్డి రమేష్ ఎం జనార్దన్ గోవ ర్ధన్ నరసింహారెడ్డి సూర్య ప్రకాష్ రాజు నాయక్ శ్రీకాం త్ రాజేందర్రెడ్డి గోపాల్ రెడ్డి బాబు వెంకటేష్ హరీష్ శేఖర్ అనిల్ కుమార్ వాణి శ్రీ జరుద్దీన్ శ్రీనివాసరావు శ్రీనివాసులు నవీన్ కుమార్ ముస్తఫా కిష్టయ్య లక్ష్మణ్ వెంకటేష్ , భీమేష్ ప్రకాష్ గౌడ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసిస్టుల సాధికారతే.. ప్రజారోగ్యానికి శ్రీరామరక్ష

- **మందుల భద్రత నుంచి ప్రజారోగ్యం వరకు ఫార్మసిస్టులది కీలక పాత్ర**
- **కాంట్రాక్ట్ సిబ్బంది క్రమబద్ధీకరణ, కాలపరిమితి ఆధారిత పదోన్నతులు కల్పించాలి**
- **తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామగట్ల కుమార్**





నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో , సెప్టెంబరు 24 (జనంసాక్షి): ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన వైద్య సేవలు అందించడంలో ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలకమని తెలంగాణ రాష్ట్ర ఫార్మ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామగట్ల కుమార్ అన్నారు. మందుల భద్రత, నాణ్యత, సరైన వినియోగం, నిల్వ, పంపిణీతో పాటు టీకాల నిర్వహణ, ఔషధ రంగంలో ఫార్మసిస్టుల సేవలు ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు.ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 సంవత్సరానికి ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ఫార్మసిస్టుల సాధికారత అనే ఇతివృత్తంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యుడు వ్యాధిని గుర్తిస్తే.. చికిత్సకు అవసరమైన ఔషధం సురక్షితంగా, నాణ్యంగా రోగికి చేరేలా చేయడంలో ఫార్మసిస్టు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఫార్మసిస్టుల సాధికారత ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.ఫార్మసిస్టుల హోదాకు తగిన గుర్తింపు ఇవ్వాలని, ఫార్మసిస్టులను ఫార్మసీ ఆఫీసర్ గా గుర్తించిన నేపథ్యంలో వారి వృత్తిపరమైన అభివృద్ధికి, సేవల విస్తరణకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు.ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఫార్మసీ ఆఫీసర్లకు సీనియర్ ఫార్మసీ ఆఫీసర్, 12 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారికి చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

రోగుల సంఖ్య, పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక సీనియర్, ఒక జూనియర్ ఫార్మసీ ఆఫీసర్ పోస్టులను మంజూరు చేయాలని అన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఫార్మసిస్టులను క్రమబద్ధీకరించాలని,2024 నోటిఫికేషన్ ద్వారా చేపట్టిన నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో మిడ్-లెవెల్ హెల్త్ కేర్ ప్రొవైడర్లు గా ఉన్నత విద్యనభ్యసించిన అభ్యర్థుల సేవలను వినియోగించుకోవాలని కోరారు. నిరుద్యోగ ఫార్మసిస్టులకు జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు రూ.5 లక్షల వరకు సబ్సిడీ అందించాలని,ప్రైవేట్ ఫార్మసీలు, ఆస్పత్రుల్లో పనిచేసే ఫార్మసిస్టులకు అర్హత, బాధ్యతలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజారోగ్య వ్యవస్థలో ఫార్మసిస్టుల సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకోవడంతోపాటు, వారి వృత్తిపరమైన హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని దామగట్ల కుమార్ కోరారు.

## బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



**మల్దకల్,సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** మండల పరిధిలోని కుర్తి రావులచెరువు గ్రామంలోజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారంబాలల హక్కులు,బాల్యవివాహాలు, పోషణమాసం,సఖి సెంటర్లో అందించే సేవలు బేటి బచావో బేటి పడావో , సుకన్య సమృద్ధి యోజన పథకం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పిల్లలందరూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అందరూ మంచిగా చదువుకోవాలని సూచించారు.చిన్న వయసులో బాల్య వివాహము చేసుకోవడం ద్వారా వచ్చే నష్టాలు గురించి బాలల పరిరక్షణ ప్రతినిధి పద్మ తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ లక్ష్మి, డిహెచ్ యు డబ్ల్యూ చిట్టి,సఖిసెంటర్ కౌన్సిలర్ స్వాతి,ఐసిడిఎస్ సూపర్వైజర్ జయమ్మ, గ్రామ సర్పంచ్ భగవంతు, హెడ్మాస్టర్ క్రాంతి కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచవటిలో
## రికార్డు స్థాయి లడ్డూ వేలం



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రాఘవపూర్-హుమ్మాపూర్ శివారులోని పంచవటి క్షేత్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం లడ్డూ వేలం నిర్వహించారు. పంచవటి పీఠాధిపతి కాశీనాథ్ బాబా ఆధ్వర్యంలో జరిగిన వేలంలో బీదర్, నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. బీదర్‌కు చెందిన అమర్ పాటిల్ రూ.35 లక్షల వరకు వేలం పాడగా, కోహిర్ మండలం చింతల్‌ఘట్‌కు చెందిన బంగారు వ్యాపారి వీరన్న-విజయలక్ష్మి దంపతులు రూ.36.00001 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం కాశీనాథ్ బాబా, వేదపండితులు దంపతులను శాలువాతో సత్కరించి లడ్డూను అందజేశారు.

## క్రీడలు గెలుపోటములు నేర్పిస్తాయి



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** క్రీడలు గెలుపోటములను నేర్పడంతో పాటు పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మెదక్ వెస్లీ గ్రౌండ్‌లో బాలికల అండర్-14, అండర్-17 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను జిల్లా విద్యాధికారి రాజుతో కలిసి ప్రారంభించారు. క్రీడాకారులు మండల స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని శ్రీనివాసరావు ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

జిల్లా విద్యాధికారి రాజు మాట్లాడుతూ క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. మెదక్‌ను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నాగరాజు, డీవైఎస్‌ఓ రమేష్, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వృద్ధుల హక్కులపై విస్తృత అవగాహన కల్పించాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా వృద్ధుల సంక్షేమం, సంరక్షణ, భద్రత, హక్కులపై రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంరక్షణ, భద్రత, సంక్షేమం, చట్టబద్ధమైన హక్కులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వృద్ధులను గౌరవంగా చూడటం, వారి అవసరాలను గుర్తించి అవసరమైన సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వృద్ధుల హక్కులు, భద్రతను పరిరక్షించేందుకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వృద్ధులు గౌరవప్రదంగా, ఆరోగ్యకరమైన జీవితం గడిపేలా అవసరమైన సహాయాన్ని అందించేందుకు అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ: ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ





**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్), రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులకు వేరుశనగ విత్తనాలను అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఒక్కో రైతుకు ఒక యూనిట్ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు భూమితో పాటు బోరు సౌకర్యం ఉండి, వ్యవసాయం చేస్తున్న వారిని గుర్తించి విత్తనాలు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతుల సంక్షేమమే లక్ష్యంగా పలు పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. స్ప్రింక్లర్ల పంపిణీ, రైతు బోనస్, రైతుబంధు, రైతుబీమా, మద్దతు ధరకు పంటల కొనుగోలు, సబ్సిడీపై విత్తనాలు, సకాలంలో ఎరువుల సరఫరా వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూరగాయల సాగు, పాల ఉత్పత్తి, ఆయిల్‌పామ్, పత్తి సాగుపై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. ఈ రంగాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నేరుగా అర్హులైన రైతులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

- **నీటి సంరక్షణ, మౌలిక వసతులు, పారిశుధ్యానికి ప్రాధాన్యత: కలెక్టర్ ప్రియాంక**



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి అందుబాటులో ఉన్న సామాజిక, ఆర్థిక, మౌలిక వసతులు, మానవ వనరులను గుర్తించి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. గురువారం సింగారం మలుపు సమీపంలోని వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామంలోని అవసరాలను విడివిడిగా కాకుండా సమగ్రంగా గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో భవిష్యత్ తాగునీటి సమస్యలను నివారించేందుకు భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం పనులను స్థానిక అవసరాలకు అనుగుణంగా రూపొందించి గ్రామ మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగపడేలా చూడాలన్నారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ కింద మంజూరైన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో రెండు నెలల్లో 270కు పైగా భవనాలు మంజూరైనా నిర్మాణాలు ప్రారంభించినవి తక్కువగా ఉన్నాయని తెలిపారు. అవసరమైన స్థలాన్ని గుర్తించి తీర్మానాలు సమర్పిస్తే మంజూరు ప్రక్రియ వేగవంతం చేస్తామని చెప్పారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. తడి, పొడి, ఇతర వ్యర్థాలను నిబంధనల ప్రకారం వేరు చేసి సేకరించాలన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న వ్యర్థాల సేకరణ వాహనాలను సమర్థవంతంగా వినియోగించి ఇంటింటి నుంచి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. పారిశుధ్యం ప్రజలందరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ వెంకట్ రాములు, జెడ్పీ సీఈవో శ్రీనివాస్ రావు, పీఆర్ఈఈ అశోక్, మిషన్ భగీరథ ఈఈ రంగారావు, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, సర్పంచులు, ఎంపీడీవోలు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లకు
## త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

- **ఎంపీడీఓ ఎన్.కిషోర్**



**కృష్ణ, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతినా పూర్తి చేసుకోవాలని కృష్ణ ఎంపీడీఓ కిషోర్ కుమార్ సూచించారు. మండలానికి నూతనంగా 11 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ గురువారం మండల్ పరిషత్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ లబ్ధిదారులకు తగు సూచనలు చేశారు. లబ్ధిదారులు త్వరగా ఇండ్ల నిర్మాణం చేసుకుంటే ఇంకా కొన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలిపాటేల్, విజయప్ప గౌడ, యూత్ అధ్యక్షులు సర్వరాజు, సర్పంచ్ లు నాగేంద్ర, వెంకటయ్య, లింగప్ప, సురేష్, కున్ని గ్రామానికి చెందిన ఇద్దరు గుడెబల్లూరుకు చెందిన 5 గురు, ఖాన్ దొడ్డికి చెందిన 4 గురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తొమ్మిది జిల్లాలకు బీజేపీ దివ్యాంగుల విభాగం ఇన్‌చార్జిగా బెస్త యాదగిరి

- **దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడి**



**వనపర్తి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల విభాగం జిల్లా ఇన్‌చార్జీలను నియమించింది. ఇందులో భాగంగా రాష్ట్ర దివ్యాంగుల విభాగం రాష్ట్ర కో కన్వీనర్ బెస్త యాదగిరికి తొమ్మిది జిల్లాల బాధ్యతలను అప్పగించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ఆదేశాల మేరకు రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వరరావు ఈ నియామకాన్ని ప్రకటించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.బెస్త యాదగిరికి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ఆయా జిల్లాల్లో పర్యటించి దివ్యాంగుల విభాగం కమిటీలను బలోపేతం చేస్తామని యాదగిరి తెలిపారు. క్షేత్రస్థాయిలో దివ్యాంగుల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. దివ్యాంగులకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హక్కులు, రిజర్వేషన్లు, ఉపాధి అవకాశాలు, ఇతర సౌకర్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దివ్యాంగులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో దశలవారీగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. దివ్యాంగుల హక్కులు, సంక్షేమం, గౌరవప్రదమైన జీవనం కోసం పార్టీ దివ్యాంగుల విభాగాన్ని జిల్లాల వారీగా మరింత పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తామని బెస్త యాదగిరి పేర్కొన్నారు.

## విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు



**కొత్తపల్లి సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** నిద్దింత జెడ్పీ ఉన్నత పాఠశాలలో సేవా భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. డిజిటల్ విద్యా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆర్. ఆంజనేయులు సేవా భారతి ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ల్యాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, దేవేందరప్ప, వెంకట్రాములు, వేణుగోపాల్, భీంసేన్, ఆనందం, నగేష్, హన్మంతు, పీడీ కాతలప్ప, ఉమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సేవా భారతి ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యా వ్యతిరేక విధానాలపై నిరంతరం ఉద్యమిస్తాం: ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్




**చేర్యాల, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై నిరంతరం ఉద్యమిస్తామని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) సిద్దిపేట జిల్లా 5వ మహాసభలు చేర్యాల పట్టణంలోని వాసవి గార్డెన్ లో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఏఐఎస్ఎఫ్ దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై, విద్యా రంగ పరిరక్షణ కోసం నిర్వహించిన పోరాటాల చరిత్రను వివరించారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచి విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన ఉద్యమాలు, విద్యార్థుల హక్కుల సాధనలో సంఘం పోషించిన పాత్రను ప్రస్తావించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా విధానాలతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సౌకర్యాలు, నిరుద్యోగం వంటి అంశాలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా నిర్మాణ బాధ్యులు మందా పవన్, మాజీ నాయకులు బట్టు దయానంద రెడ్డి,స్వర్గం రాజేశం,నర్సింహారెడ్డి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగెం మధు,జేరిపోతుల జనార్దన్,వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్,సహాయ కార్యదర్శులు వేల్పుల ప్రసన్న కుమార్,చిట్యాల శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిటి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ



**అల్లాదుర్గం, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి అన్నారు. అల్లాదుర్గం గ్రామంలోని పోచమ్మ గుడి వద్ద నుండి జగిర్యాల క్రాస్ రోడ్డు వరకు బిటి రోడ్డు నిర్మాణానికి 7కోట్ల ఇరవై లక్షలు మంజూరయ్యాయి. గురువారం ఇట్టి రోడ్డు నిర్మాణ పనులకు వట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు,కొప్పుల శేషా రెడ్డి, మండల సర్పంచులు పోరం అధ్యక్షులు నర్సింహా రెడ్డి , సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుభాష్ రావు,డిసిసి కార్యదర్శి బాల్ కిషన్ ,జిల్లా కాంగ్రెస్ ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు బలరాం తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలతో పాఠశాల నిర్మాణం పూర్తిచేయాలి

• జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్





**ఉప్పునుంతల, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** ఉప్పునుంతల మండలం రాయిచేడ్ గ్రామంలో అచ్చంపేట నియోజకవర్గానికి సంబంధించిన సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి ఆయన పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, చేపట్టాల్సిన పనులు, నిర్మాణానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్మాణ సామగ్రి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలతో పాటు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పాఠశాలను నిర్మించాలని తెలిపారు. తరగతి గదులు, విద్యార్థుల వసతి, భోజన సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, క్రీడా సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తూ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తిచేసి పాఠశాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పాఠశాల నిర్మాణంతో అచ్చంపేట నియోజకవర్గ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ

• స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం
• అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి





**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 24(జనంసాక్షి):** స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం, జీవన నైపుణ్యాలు పెంపొందుతాయని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి అన్నారు. గురువారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంగారెడ్డి జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంగారెడ్డి జిల్లా సైన్స్ కేంద్రంలో ప్రశాంత, స్నేహపూర్వక వాతావరణంలో ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి జాన్ శామ్యూల్, సహాయ రాష్ట్ర నిర్వహణ కమిషనర్ వెంకటేశ్వర్లు పరిశీలకులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి మాట్లాడుతూ... స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం, జీవన నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు. గత ఏడాది శిబిరాన్ని ముందస్తు ప్రణాళికతో విజయవంతంగా నిర్వహించిన బృందాన్ని అభినందించారు.

రాష్ట్ర సహాయ కార్యదర్శి జాన్ శామ్యూల్ మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 2,000కుపైగా ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోగా శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అనంతరం వెంకటేశ్వర్లు ఎన్నికల ప్రక్రియను నిర్వహించగా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవ జిల్లా కలెక్టర్ అధ్యక్షుడిగా, జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లా ప్రధాన కమిషనర్‌గా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు: అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జగదీష్, జిల్లా పౌర సంబంధాల అధికారి విజయలక్ష్మి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీనివాస్, జిల్లా పశువైద్యాధికారి వసంతకుమారి.

ఇతర కార్యవర్గం: జిల్లా కమిషనర్లుగా అంజగౌడ్, ఎలిజబెత్; జిల్లా కార్యదర్శిగా మాధవరెడ్డి; కోశాధికారిగా జి.సుందర్‌రావు; సంయుక్త కార్యదర్శిగా శోభ; నిర్వహణ కమిషనర్లుగా ఆంజనేయులు, వందన; శిక్షణ కమిషనర్లుగా చంద్రశేఖర్‌గౌడ్, సుజాత; సహాయ రాష్ట్ర ప్రధాన కార్యాలయ బాధ్యులుగా వీరేశం, స్వప్నశ్రీ ఎన్నికయ్యారు.

# నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** కొంటూర్ చెరువు వద్ద శుక్రవారం జరగనున్న గణేష్ నిమజ్జనాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు గురువారం భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన ప్రాంతం, శోభాయాత్ర మార్గాలను పరిశీలించి బారికేడింగ్, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెరువులో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచి, వారు మద్యం సేవించకుండా చూడాలన్నారు. క్రేన్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా కీలక ప్రాంతాల్లో పోలీసులను ఏర్పాటు చేసి, నిమజ్జన ప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు పోలీసులకు సహకరించి నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నవరాత్రి వేడుకలు



**అమీన్‌పూర్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్లలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. 11వ రోజు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగమయ్య కాలనీలో తన సొంత ఖర్చులతో మహా అన్నదానం ఏర్పాటు చేసి, స్వయంగా భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా నరసింహ గౌడ్ మాట్లాడుతూ నిమజ్జన శోభాయాత్రలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పిల్లలు, పెద్దలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందారం రమేష్ గౌడ్, ఇంద్రేశం జ్ఞానేశ్వర్, ఎన్ఎన్‌జీ యువసేన సభ్యులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

• ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్




**చేర్యాల, సెప్టెంబర్ 24(జనంసాక్షి):** జిల్లా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పాకాల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినేతల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో విద్య రంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ విద్యారంగా అభివృద్ధికి అనేక నిధులు కేటాయిస్తామని చెప్పి ఇప్పటివరకు చెప్పిన మాటలను నెరవేర్చలేదు, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి, రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యాశాఖ పూర్తిస్థాయిలో గాడి తప్పిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యదర్శి అందే బీరయ్య మాట్లాడుతూ.. ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వవలసిన స్కాలర్‌షిప్స్, రియంబర్స్మెంట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని దుయపట్టారు. విద్యాశాఖ పై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు, రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నియమించి ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలని, విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంత మేరకు నిధులు చేకూర్చిందో దానిపై పూర్తిస్థాయి శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, తాళ్లపల్లి గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాయసముద్రం చెరువులో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



**రామచంద్రాపురం,సెప్టెంబర్ 24(జనంసాక్షి):** రామచంద్రపురం పరిధిలోని రాయసముద్రం చెరువులో గణేష్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. శ్రీ రమేష్, ఐపీఎస్ పరిశీలించారు. బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, వాహనాల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ నిర్దేశిత మార్గాల్లోనే వెళ్లాలని, బారికేడ్లు దాటి చెరువులోకి వెళ్లవద్దని కోరారు. పిల్లలు, మహిళలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, క్రేన్ల వద్ద ప్రజలు గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖలతో సమన్వయంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, ఐపీఎస్, ఆర్సీ పురం ఏసీపీ సీహెచ్ వై. శ్రీనివాస్ కుమార్, ఆర్సీ పురం ఇన్‌స్పెక్టర్ జి. లాలు నాయక్, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ ఎం. ప్రవీణ్ రెడ్డి, చందానగర్ ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల తీర్పును గౌరవించాల్సిందే: ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి



**చేర్యాల, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు గురువారం కీలక నిర్ణయం తీసుకోవడం పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ముఖ్యమైన పరిణామమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరిన వ్యవహారంలో హైకోర్టు అనర్హతకు సంబంధించిన తీర్పు ఇచ్చిందన్నారు. ఆ తీర్పుపై దానం సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ సుప్రీంకోర్టు కూడా నిరాకరించిందని పేర్కొన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు పార్టీ మారడం ప్రజల తీర్పును అవమానించడమేనన్నారు. ప్రజల తీర్పును గౌరవించడం, రాజ్యాంగం నిర్దేశించిన విధానాలను పాటించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని స్పష్టం చేశారు. ఇకనైనా ప్రభుత్వం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం మానుకుని ప్రజల తీర్పును గౌరవించాలని డిమాండ్ చేశారు.

# షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం... రూ.20 లక్షల ఆస్తి నష్టం



**శివ్వంపేట, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** మండల కేంద్రమైన శివ్వంపేట గ్రామానికి చెందిన కంటాల హనుమంత్ గుప్తా కిరాణా దుకాణం పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రతి రోజు మాదిరిగానే బుధవారం రాత్రి దుకాణం మూసివేసి వ్యాపారులు ఇంటికి వెళ్లారు. గురువారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో దుకాణంలో ఉన్న ఫ్రిజ్ ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో బ్లాస్ట్ కాగా మంటలు చెలరేగి వ్యాప్తి చెందాయి. మంటలు మరింత విజృంభించి దుకాణంలో ఉన్న నూనె డబ్బాలు, కిరాణా సరుకులు, ప్లాస్టిక్ వస్తువులతో మంటలు వేగంగా వ్యాప్తి చెంది దుకాణం నుండి దట్టమైన పొగలు, మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే దుకాణ యజమానికి, అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దాదాపు గంటపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు రూ. 20 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధిత వ్యాపారి హన్మంత్ గుప్తా తెలిపారు. తెల్లవారుజామున ఈ అగ్ని ప్రమాదం జరగడంతో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. సంఘటనా స్థలాన్ని శివ్వంపేట పోలీసులు పరిశీలించి, షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.